==================================================================
Language in India www.languageinindia.com ISSN 1930-2940 Vol. 21:9 September 2021
==================================================================

# మారిషస్ దేశంలో బహుభాషా వ్యవహారం – తెలుగు భాషకుగల స్థానం

# The Status of Telugu in a Multilingual Society with Special Reference to Mauritius

**Dr. (Mrs.) Rajwantee Dalliah (Ph.D.)**
**Lecturer, Department of Telugu Studies**
**Mahatma Gandhi Institute, Mauritius**
**rdalliah@yahoo.com**
**reena.dalliah@mgi.ac.mu**

====================================================================

This research paper gives an overview of the status of Telugu in the multilingual and multiethnic Mauritian society ranging from the arrival of the Telugu migrants till date. It also focuses on a brief outline of the role of Telugu language and culture in this environment.

This paper consists of sections with a brief introduction about Mauritius and progresses with the development of themes such as the historical background of the plurilingual island-nation, the situation of the Telugu migrants and the role of Indian languages in Mauritius. It also analyses the change in the status of Telugu language from mother-tongue to second/foreign language. Moreover, it also focuses on the teaching of Telugu in the present second/foreign language situation.

After their arrival from South India from the 1830s, the Telugu migrants, though limited in number, tried by all means to preserve their maternal language and culture. However, after four to five generations, today Telugu is no longer considered as a maternal language but rather, as an ancestral language. The presence of the Mauritian Kreol as the mother-tongue of most Mauritians and the role of French and English as the colonial languages have deeply impacted upon the Indian languages, especially the *minority* languages. As previously mentioned, this paper focuses mainly on an analysis of the gradual change in the status of Telugu and its actual place in the multilingual Mauritian society where twelve languages are in use.

## 1.0 ఉపోద్ఘాతం

హిందూ మహా సాగరంలోని చిన్న ద్వీపం మారిషస్. దీన్ని "మిని భారతదేశం" అని కొందరు వ్యవహరిస్తారు. రోడ్రీగ్స్, అగాలెగా, సెంట్ బ్రాండో వంటి తోటి ద్వీపాలతో

కూడి "ఇంద్రధనుస్సు ద్వీపం"గా పేరుపొందిన మారిషస్ బహు భాషలకు, బహు మతాలకు నిలయమైంది. దాదాపు 12 లక్షల కన్న ఎక్కువ జనులున్న 720 చదరపు మిటర్ల విస్తీర్ణంగల ఈ చిన్న ద్వీపంలో, మొరిష్యన్ క్రియోల్, ఆంగ్లం, ఫ్రెంచి, హిందీ, తమిళం, తెలుగు, మరాఠీ, ఉర్దూ, భోజ్‌పురీ, గుజరాతి, మాండరిన్, అరబ్బీ మొదలైన పన్నెండు భాషలు వాడుకలో ఉండటం మారిషస్ దేశంలోని బహుభాషీయతకు నిదర్శనం. ఈ పరిశోధన పత్రంలో ఇక్కడ ఉన్న బహుభాషీయ వ్యవహారం, ఇన్ని భాషలలో తెలుగు భాషకున్న స్థానాన్ని పరిశీలించటం జరుగుతుంది.

## 1.1 బహుభాషీయ మారిషస్ – చారిత్రక నేపథ్యం

పన్నెండో శతాబ్దంలో స్వాహిలి నావికులు మారిషస్ ద్వీపాన్ని కనిపెట్టినప్పుడు, ఇక్కడ ప్రజలు ఉండేవారన్న ఆధారం ఎక్కడా లభించలేదు. నాలుగు వందల ఏళ్ల తర్వాత పోర్చుగీసువారు, డచ్చివారు ఈ దీవిలో కాలు మోపారు. కాని ఫ్రెంచివాళ్లే ఇక్కడ మొదటి వలసలు నెలకొల్పినవారు అయ్యారు. ఈ ద్వీపాన్ని క్రమంగా డచ్చివారు, ఫ్రెంచివారు, బ్రిటిషువారు ఆక్రమించి పరిపాలించారు. 1968వ సంవత్సరంలో మారిషస్ దేశానికి స్వాతంత్ర్యం లభించాక, 1992వ సంవత్సరంలో ఇది గణతంతమైంది. "Mauritius is a multiethnic and multilingual country" - మారిషస్ భిన్న జాతుల, భిన్న భాషల దేశమని Rajah-Carrim (2007) తెలియజేశారు.

బహుభాషీయ మారిషస్ దేశంలో పాశ్చాత్య భాషలైన ఇంగ్లీషు, ఫ్రెంచితోపాటు భారతీయ భాషలు కూడా వ్యవహారంలో ఉన్నాయి. పూర్వం డచ్, ఫ్రెంచి, బ్రిటిష్ దేశాల పరిపాలన; భారత, ఆఫ్రికా దేశాలనుంచి వలసదారుల రాక మొదలైనవి ఇక్కడ బహుభాషీయత ఏర్పడటానికి ప్రధానమైన కారణాలు. మారిషస్ దేశంలో ఇంగ్లీషు, ఫ్రెంచి, క్రియోల్, భారతీయ భాషలకున్న స్థానాన్ని అర్థం చేసుకోటానికి, ఇక్కడ భూత, వర్తమాన కాలాల్లో ఉన్న క్లిష్టమైన సాంఘిక, ఆర్థిక, విద్యా, సాంస్కృతిక, రాజకీయ పరిస్థితులను బాగా పరిశీలించవలసిన అవసరం ఎంతగానో ఉంది.

డచ్ నుంచి ఫ్రెంచి పరిపాలనకు, చివరికి బ్రిటిషు పరిపాలన కిందకు రావటం వల్ల 19వ శతాబ్ది మధ్యకాలం నుంచి 20వ శతాబ్దం ప్రారంభకాలం వరకు, భాషల "four-part harmony" అనేది ఏర్పడిందని Miles (2000) తెలియజేశాడు.

> "Kreol is the uncontested lingua franca; French as the inherited language of social and cultural prestige; English as the language of education, law, public administration and to a [small] degree commerce; and the panoply of Indian languages" (ibid: 217)

అంటే మారిషస్ దేశంలో వ్యవహారంలో ఉన్న క్రియోల్ నిస్సందేహంగా సంపర్క భాష అనీ; సాంఘిక, సాంస్కృతిక ప్రతిష్ఠ (prestige) వల్ల వచ్చిన భాష ఫ్రెంచి అనీ; విద్యా శాఖలో, న్యాయ, ప్రభుత్వ కార్యాలయాల్లో, (కొంత వరకు) వ్యాపారంలో వాడబడే భాష ఇంగ్లీషు అనీ; వీటితోపాటు అనేక భారతీయ భాషలు – వీటన్నిటి మధ్య ఉన్న "చతురంగ పొందిక" గమనార్హమని Miles అభిప్రాయం.

## 1.2 భారతీయ భాషలు – పూర్వీకుల భాషలు

> "మారిషస్ దేశం బహు భాషల కూడలి, విభిన్న సంస్కృతీ సంప్రదాయాలకు నిలయం" (రెడ్డి లక్ష్మడు, 2013: పు. 15).

ఇక్కడ వ్యవహారంలోనున్న పన్నెండు భాషలను పూర్వీకుల భాషలు - ancestral languages (భారతీయ, చీనీ భాషలు), పాలక భాషలు - colonial languages (ఆంగ్లం, ఫ్రెంచి భాషలు), దైనందిన వ్యవహారంలో ఉన్న భాష (మొరిష్యన్ క్రియోల్/ క్రియోల్) అనే మూడు ముఖ్యమైన గుంపులుగా విభజించవచ్చునని Rajah-Carrim (2005) తెలియజేశారు.

రెండు కన్న ఎక్కువ భాషల్లోనూ భౌగోళిక, చారిత్రక, సాహిత్య, సాంస్కృతిక సాన్నిహిత్యాన్ని బహుభాషా వ్యవహారం అని అంటారు. బహుభాషీయ వాతావరణంలో వ్యవహారంలోనున్న భాషల్లో ఒకటి ఉన్నతస్థాయి భాషగా (prestige language) ఉంటుంది. ఒక నాటి పాలకుల భాషలైన ఆంగ్లమూ ఫ్రెంచీ భాషల ప్రాముఖ్యం నేటికి మారిషస్ దేశంలో తగ్గలేదు. సాధారణంగా పాలకుల భాష అవడంవల్ల గాని, సంఖ్యాబలంవల్ల గాని ఒక భాషకి గౌరవస్థానం లభిస్తుంది.

ఇంతకు ముందు చెప్పినట్టుగా, మారిషస్ బహుభాషీయ దేశం మాత్రమేకాక, ఇది బహు మతాలకు నిలయం కూడా (Rajah-Carrim, 2007). ఇక్కడ వాడుకలోనున్న

హిందీ, భోజ్‌పురీ, తెలుగు, తమిళం, మరాఠీ, ఉర్దూ మొదలైన భారతీయ భాషలనూ, చీనీ భాషలనూ "పూర్వీకుల భాషలు"గా వ్యవహరించటం జరుగుతుంది. "పూర్వీకుల భాషలు" అంటే మారిషస్ దేశానికి వచ్చినప్పుడు ఆసియా ప్రవాసులు మాట్లాడిన భాషలన్న మాట. కాని నేడు ఈ భాషలు మాతృభాషలుగా (native language) కాక, వివిధ జాతులకు అస్తిత్వ గుర్తులుగా మాత్రమే పరిగణింపబడతాయి. క్రియోల్ మాతృ భాషగాగల బహుభాషీయ మారిషస్ దేశంలో, పూర్వీకుల భాషలు అస్తిత్వ గుర్తులు (markers of identity)గా మాత్రమే మిగిలిపోయాయని Eriksen, Stein వంటి గొప్ప భాషా వేత్తలు కూడా తెలియజేశారని Rajah-Carrim (2007) సూచించారు. ఆవిడ అభిప్రాయాన్ని బట్టి ఈ దేశంలో మతాలకూ, భాషలకూ మధ్య సన్నిహితమైన సంబంధముంది.

> "Most ethnic groups have an 'ancestral language' with which they identify." (ibid: 52)

ఇక్కడ వ్యవహారంలోనున్న పన్నెండు భాషల్లో దాదాపు ప్రతి భాషను ఒక ప్రత్యేకమైన జాతికి చేర్చటం జరుగుతుందని ఆవిడ సూచించారు (అంటే దాదాపు ప్రతి జాతి సముదాయాన్ని (ethnic group) ఒక ప్రత్యేక (పూర్వీకుల) భాషతో అన్వయించటం జరుగుతుంది).

మారిషస్ జనాభా లెక్కలనుబట్టి పూర్వం భారతదేశంనుంచి వలస వచ్చిన ప్రవాసులను *"Indo-Mauritians"*, *"Other Indians"* అనే రెండు గుంపులుగా విభజించటం జరిగింది. *"Indo-Mauritians"* అనగా మారిషస్ దేశంలో పుట్టిన భారతీయ మూలమైన ప్రవాసుల భావి వంశస్థులన్న మాట. మారిషస్ దేశంలో తెలుగువారు కూడా ఈ విభాగానికి చెందినవారు. కాని దేశంలో ఉన్న హిందువులను జాతిపరంగా, సంస్కృతిపరంగా విభజించే దృష్టితో, 1961 జనాభా లెక్కల ప్రకారంగా ఈ *"Indo-Mauritians"* అనే విభాగాన్ని హిందువులు, తమిళంవారు, తెలుగువారు, మరాఠీవారు అనే ఉపవిభాగాలుగా విభజించటం జరిగిందని Bhat & Bhaskar (2007) తెలియజేశారు. తత్ఫలితంగా తెలుగువారితోపాటు ఇక్కడున్న అనేక జాతులవారు తమ తమ పూర్వీకుల భాషలను బట్టి వేర్వేరు "జాతులు" ఏర్పరచుకోవటం జరిగింది. ఈ విధంగా తమలో ఉన్న సాంస్కృతిక, మత సంబంధమైన భేదాలను సూచించటానికి

వారిని హిందీ భాషీయులుగా (హిందీ భాష మాట్లాడే బిహారీలు, ఉత్తర భారతీయులు); తెలుగువారుగా (దక్షిణ భారతదేశం నుంచి వలసవచ్చిన తెలుగు భాషీయుల వంశస్థులు); తమిళంవారుగా (దక్షిణ భారతదేశం నుంచి వచ్చిన తమిళ భాషీయుల వంశస్థులు); మరాఠీలుగా (బొంబాయి ప్రెజిడెన్సీనుంచి వచ్చిన మరాఠీ భాషీయుల వంశస్థులు) పేర్కొనటం జరిగిందని Bhat & Bhaskar (2007) ప్రకటించారు.

19వ శతాబ్దంలో భారతదేశం నుంచి ప్రవాసులు మారిషస్ దేశానికి వలస వచ్చినప్పుడు, తమతోపాటు తమ భాషా సంస్కృతులను కూడా చేపట్టి ఇక్కడ స్థిరపడ్డారని తెలుస్తుంది. తమ మాతృ భూమియైన భారతదేశం నుంచి ఇంత దూరంగా ఉన్నారు కాబట్టి తమ భాషా సంస్కృతులను పరిరక్షించటానికి అన్ని విధాలా ప్రయత్నించారు. వారు తమ భాషా సంస్కృతులను కోల్పోతారనే భయం క్రమంగా హిందీ, తెలుగు, తమిళం, మరాఠీ మొదలైన భాషలను "జాతి సమూహాలు"గా (ethnic groups) పరిగణింపబడటానికి దారి తీసింది.

> "మారిషస్‌లో హిందూ మతస్థులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. కాని ఈ మతంవారు భాషా ప్రయుక్తంగా కొన్ని శాఖలలో విభజింపబడ్డాయి. వాళ్ల విభజనలో ఈ ప్రకారంగా ఉంది. హిందీ, భోజ్‌పురి భాషలు మాట్లాడే హిందువులు కాక, భారతదేశంలోని ఆయా రాష్ట్రాలనుంచి వచ్చిన హిందువులను గురించి ఈ విధంగా చెప్పవచ్చు. తమిళ హిందువులు, తెలుగు హిందువులు, మరాఠీ హిందువులు, గుజరాతి హిందువులు". (రెడ్డి లక్ష్మీడు, 2013: పు. 16)

అంటే ప్రతి ఒక్క భారతీయ భాషకు చెందిన భాషీయులకు ఒక ప్రత్యేక "జాతి సమూహం" ఏర్పడటం జరిగింది. ఈ విధంగా మారిషస్ అనేక భాషా సంస్కృతులకు నిలయమై, "భిన్నత్వంలో ఏకత్వం" అనే సూత్రానికి నిదర్శనమైంది.

## 2.0 మారిషస్ దేశంలో తెలుగువారి స్థితిగతులు

మారిషస్ దేశంలో తెలుగు భాష భారతదేశంనుంచి వచ్చిన తెలుగు వలసదారుల మాతృ భాషనుంచి ద్వితీయ భాష స్థానానికి ఏ విధంగా పడిపోయిందో

అని తెలుసుకోటానికి, ముందు ఇక్కడ ఉన్న తెలుగువారి చరిత్రను, వారి భాషా వికాస చరిత్రను గురించి అవగాహన చేసుకోవాలి.

2011 జనాభా లెక్కల ప్రకారం మారిషస్ దేశంలో తెలుగువారి సంఖ్య 27,787 మాత్రమే. 2002 జనాభా లెక్కలను పోల్చి చూస్తే (29,792), తెలుగువారి సంఖ్య తగ్గిపోతున్నదని తెలుస్తుంది. తెలుగువారికి తక్కువ మంది పిల్లలు ఉండటం, కొంత మంది తెలుగువారు క్రైస్తవ మతాన్ని అవలంబించటం, జనాభా లెక్కల (census) ప్రక్రియ జరిపే అధికారులు వారి జాతిని (ethnicity) గురించి అడిగితే, వ్యవహర్తలు "తెలుగు" అని చెప్పే బదులుగా "హిందు" అనటమే దీనికి ముఖ్యమైన కారణాలుగా పేర్కొనవచ్చు (ఇక్కడ హిందు అంటే హిందీ భాషీయులే అన్నమాట).

1810వ సంవత్సరంలో బ్రిటిషువారు ఫ్రెంచివారిపై దండెత్తి ఈ ద్వీప పాలనను వశపరచుకున్నారు. డచ్చివారు ప్రవేశ పెట్టిన చెరకు పంటవల్ల, ఆ కాలంలో మారిషస్ దేశం ఎక్కువగా వ్యవసాయం మీదనే ఆధారపడి ఉండేది. అప్పటి పొలాల యజమానులు ఎక్కువగా ఫ్రెంచివాళ్లే. అయితే ఆ పొలాలలో పని చేయటానికీ, అడవుల్లో చెట్లను నరికి వేయటానికీ, రోడ్లను నిర్మించటానికీ ఆఫ్రికా, మడాగాస్కర్, మొజాంబిక్, భారతదేశం మొదలైన దేశాలనుంచి బానిసలను తెప్పించారు. కాని 1835వ సంవత్సరంలో బానిసత్వం నిషేధించాక, విముక్తులైన బానిసలు పొలాలలో పని చేయటానికి నిరాకరించారు. తత్ఫలితంగా ఫ్రెంచి యజమానులు పాలకుల అధికారంతోను, అనుమతితోను భారతదేశం, చైనా వంటి దేశాలనుంచి చాలా మంది కూలీలను తెప్పించటం మొదలుపెట్టారు (రెడ్డి లక్ష్మణుడు, 2013).

బ్రిటిషుల పాలనకాలంలో – 1820-1830 సంవత్సరాల మధ్యకాలంలోనే భారతదేశం నుంచి ప్రవాసులు మారిషస్ దేశానికి రావటం మొదలుపెట్టారు. 1834వ సంవత్సరం నుంచి 1910వ సంవత్సరం వరకు ప్రవాస భారతీయులు బెంగాల్, మద్రాసు, బొంబాయి రాజ్యాలనుంచి వచ్చారని మహాత్మా గాంధీ సంస్థలోని Indian Immigration Archives (MGI) ఆధారాలను బట్టి తెలుస్తుంది. Indian Immigration Archives ఆధారాలనుబట్టి 1842వ సంవత్సరంనుంచి భారత ఖండంనుంచి, ముఖ్యంగా

కొలొంబొ, కోచిన్, పొండిచ్చేరి, మద్రాసు, కలకత్తా మొదలైన ప్రాంతాలనుంచి రైతులు మారిషస్ దేశంలో అడుగు పెట్టారని తెలుస్తుంది.

అయితే ఆ కాలంలో భారతదేశంలోనున్న బెంగాల్, మద్రాసు, బొంబాయి అనే మూడు రాజ్యాలలో (Presidencies) కూలీలను ఎన్నుకోటానికి ఏజంట్లు ఉండేవారు. డా. రెడ్డి లక్ష్మడుగారి (2013) అభిప్రాయాన్ని బట్టి ఆ ఏజంట్లలో కొంత మంది ఆంధ్రులు కూడా ఉండేవారనీ; వారిలో పొన్నునందా వేంకటరెడ్డి అనే వ్యక్తి కూడా ఉండేవాడనీ; ఆయనకు “కరింగ ప్యాకట్”, “చాంప్యన్” అనే రెండు ఓడలుండేవనీ; వాటిలో కూలీల రవాణా జరుగుతూనే ఉండేదని కూడా తెలుస్తుంది. అయితే ఇలా ఓడలలో ప్రయాణం చేసి, ఈ కూలీలు చాలా ఇబ్బందులకు గురి అయ్యారు. కొందరు జబ్బు పడి, ప్రాణాలు కూడా కోల్పోయారు.

> “బయలు దేరేటప్పుడు ఎమిగ్రేషన్ ఏజెంటు సంతకంతో తూర్పు ఇండియా కంపెనీనుండి మారిషసుకి వెళ్ల వలసి నిమిత్తం ఇండియా ప్రభుత్వ చట్టం 15 – 1842 మేరకు 4, 5, 6, 8 నిబంధనలననుసరించి ప్రయాణీకుల ఆరోగ్యం పరీక్షించి వలసిన మందులు మాకులు, యాత్రలో వారికి హితమైన సరకులు అన్నీ కూర్చుకొని మరీ బయలుదేర వలసి వుండేది ఓడ కమేండరు! ఇన్ని కట్టుదిట్టాలు చేసుకొన్నా ప్రయాణం ఒకొక్కసారి దైవాధీనంగానే వుండేది. దారిలో కొందరు అనారోగ్యానికి, ఇతర ప్రకృతి వైపరీత్యాలకి గురై అనువులు కోల్పోయిన సందర్భాలు కూడా వున్నాయి. కమేండర్ల లాగ్‌బుక్స్ పరిశీలిస్తే ఒకొక్క యాత్రకు సంబంధించిన వివరాలెన్నో బయట పడగలవు. ఆ శతాబ్దిలో నిండుగా కూలీలున్న నాలుగు ఓడలు దీవిని సమీపిస్తూ ప్రవాళ సీమను (coral reef) గుద్దుకొని మునిగి పోయాయి. 1859లో 485 మంది వున్న “షాజహాన్” ఓడ నిప్పంటుకొని కాలిపోయింది. ఆ సంఘటనలో నాలుగు వందల ఇరవైమంది చచ్చిపోయారు. ఇలా ఎన్ని ఉపద్రవాలు కలిగాయో తలచుకొంటే ఆ విషాద సంఘటనలు హృదయ విదారకంగా వుంటాయి.” (ఆనందమూర్తి, 1990: పు. 58)

1843వ సంవత్సరంలో మారిషస్‌కి వలస వచ్చిన కూలీల సరాసరి వయస్సు ఇరవై అయిదు సంవత్సరాలు. ఏడాదిలోపు పది పన్నెండేళ్ల వయస్సుగల పిల్లలూ తల్లిదండ్రుల వెంట మారిషస్ దేశానికి వచ్చారని దాఖలాయిన్నాయి. దంపతులేకాక స్త్రీలు, పురుషులు కొందరు ఒంటరిగా వచ్చిన సందర్భాలూ కూడా కనిపిస్తాయి.

> "వలస రికార్డ్సులో వెళ్లినవారి వివరాలు క్రమంగా పేరు, తండ్రి లేదా తల్లి లేదా భర్త పేరు, వయస్సు, సెక్సు, ఎత్తు, పుట్టుమచ్చలు గుర్తులు, కులం లేదా తెగ, గ్రామం, పరగణా, జిల్లా, మండలం, బయలుదేరిన తేదీ, ఓడ పేరు, దాని నెంబరు వివరాలు, చేరిన తేదీ, దిగిన రేవు, మారిషసులో తమకిచ్చిన రిజిష్టరు నెంబరు, ఏ ఏజంటు మూలంగా వచ్చినదీ, పనిలో చేరిన తేదీ, ఎవరిదగ్గర చేరినదీ వారి వివరాలు, ఎన్నేళ్ల పనిమీద చేరినదీ, ఫోటో, నెంబరు, ఆరోగ్య వివరాలు, రిమార్కులు వగైరాలు దాదాపు 36 ఎంట్రీలకు పైగా ఉంటాయి." (ibid: పు. 58)

ఈ వివరాలన్నీ వలస రాజ్యం అధికారులు అడుగుతుంటే కూలీలు చెప్పే సమాధానాలను విని రాసేవారు. అందువల్ల వాటిని నమోదు చేసుకోవటంలో వ్యక్తినామాలకు గ్రామనామాలకు ఎన్నెన్నో వింత వింత రూపభేదాలు అవతరించాయి. అవి రికార్డు అయిపోవటంతో ఆ పేర్లే స్థిరపడిపోయాయి.

విముక్తులైన ఆఫ్రికా బానిసల బదులుగా చెరకు తోటలలో పని చేయటానికి తెలుగువారు ముఖ్యంగా మారిషస్, ఫిజి, దక్షిణాఫ్రికా దేశాలకు వచ్చారని Bhat & Bhaskar (2007) తెలియజేశారు. తెలుగువారు భారతదేశంనుంచి మారిషస్ దేశానికి తరలి వచ్చినప్పుడు, తెలుగు భాషా, తెలుగు ఉచ్చారణ ఎరుగని అధికారులు వారి పేర్లు సరిగ్గా రాయలేకపోయారని డా. Bhaskarగారు (2015) తెలియజేశారు. కాబట్టి ఇక్కడ ఉన్న తెలుగువారి పేర్లు చాలా వరకు విరూప్యతకు గురయ్యాయి. ఇంతేకాక వారిలో చాల మంది నిరక్షరాస్యులు కూడా. అందుకే ఇక్కడి తెలుగువారి పేర్లలో చాలా మార్పులు వచ్చాయి. అందుకే ఇప్పటికీ ఇక్కడి పేర్లు వింత ఉచ్చారణలతో లిపి లేఖన క్రమంతో కనబడుతూ ఉంటాయి. ఈ వ్యత్యాసాలన్నీ విడివిడిగా గుర్తించి

పరిశీలింపవలసినవి. "రాముడు – రాండుగా, చిన్నయ్య – చిన్యాగా, సన్యాసి – సన్నాసిగా" మారటం దీనికి ఉదాహరణలుగా పేర్కొనవచ్చు. ఈ విధంగా తెలుగువారి పేర్లు ఎన్నో విధాలుగా మారిపోయాయి.

ఈ విధంగా ఏజంట్ల ద్వారా దక్షిణ భారతదేశంనుంచి తమిళంవారు, తెలుగువారు ఇక్కడ వచ్చి స్థిరపడ్డారు. ప్రవాసుల్లో ఆంధ్ర, హైదరాబాదు ప్రాంతాలనుంచి వచ్చిన తెలుగువారు 5.6 శాతం. వారు ముఖ్యంగా రాజమండ్రి, విశాఖపట్నం, గంజం, చిత్తూరు, నెల్లూరు ప్రాంతాలనుంచి వచ్చారని తెలుస్తుంది. ఇంకా కొంత మంది శ్రీకాకుళం, మచిలీపట్నం మొదలైన ప్రాంతాలనుంచి కూడా రావటం జరిగింది. తర్వాత చాలా మంది కాకినాడ, కోరంగీ ఓడరేవులనుంచి వచ్చారని తెలుస్తుంది (Indian Immigration Archives). ఆ కాలంలో తెలుగువారిని "కోరంగీలు" అనీ; వారి భాషను "కోరంగి భాష" అనీ; వారి పండగలను "కోరంగీ పండగలు" అనీ వ్యవహరించేవారు. కాని కొన్ని తరాల తర్వాత ఈ "కోరంగీ" అనే పదం అవమానార్థకంగా వాడబడింది. ఇక్కడ వచ్చినప్పుడు తెలుగువారిని "కోరింగలు, జెంటులు, తెలింగలు, కలింగలు" మొదలైన నామాల కింద నమోదు చేయటం జరిగింది (Bhaskar, 2015).

మారిషస్ దేశానికి వలస వచ్చినవారిలో చాలా మంది కాపు కులానికి చెందినవాళ్లే అని డా. రెడ్డి లక్ష్మడు (2013) తెలియజేశారు. 1834-1870 మధ్య కాలంలో ఏర్పడిన ఆర్థిక, సాంఘిక, రాజకీయ కారణాలవల్ల తెలుగువారిలో కొంత మంది భారతదేశాన్ని వదిలిపెట్టి కూలీలుగా ఇక్కడికి వచ్చారని చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తుంది. ఆనాడు భారతదేశంలో తాండవిస్తున్న అనావృష్టి, కరువు వంటి బాధలతోపాటు అక్కడి జమీందారులు పెట్టే బాధలను భరించలేక చాలా మంది పేదవారు మనుగడకోసం మారిషస్‌కు వలస వచ్చారు. వారిలో అందరూ కూలీలు కాకపోయినా, తమ మాతృదేశంలో వారు అనుభవిస్తున్న కష్టాలను తప్పించుకోటానికి కూలీల వేషాలలో ఇక్కడికి రహస్యంగా వచ్చారు. ఇలా అవకాశం దొరికినప్పుడల్లా సంవత్సరం పొడువునా కొద్దికొద్దిగా వస్తూ ఉండేవారు. చారిత్రక ఆధారాలనుబట్టి 1880వ సంవత్సరంలో దాదాపు ఇరవై వేల మంది తెలుగువారు ఇక్కడికి వచ్చి పని చేశారని

తెలుస్తుంది. వీరిలో ఎక్కువ మందిని వ్యవసాయ పనుల్లో నియమించటం జరిగింది (రెడ్డి లక్ష్మడు, 2013).

భారతదేశంనుంచి వచ్చిన తెలుగువారు తమ భాషా సంస్కృతులను, ఆచార వ్యవహారాలను పదిలపరచటానికి అన్ని విధాలా ప్రయత్నించేవారు. ఆ కాలంలో వారు ఎన్నో కష్టాలను అనుభవిస్తూ, చిన్న చిన్న గుడిసెలలో ఉంటూ, తమ గ్రామ దేవతలను, ఇలవేల్పులనూ ఆరాధిస్తూ, తమ మతాన్ని అవలంబించేవారు.

> "అలా వచ్చిన తెలుగువాళ్లు తమ ఆచార వ్యవహారాలను ఆచరిస్తూ, తమ సాంస్కృతిక ప్రత్యేకతలను కాపాడుకున్నారు. వాళ్ల ఆహారపుటలవాట్లు, వేషభాషలు, మత వ్యవహారాలు, భిన్న సంస్కృతీ సంప్రదాయాల మధ్య, వాళ్లకు ఒక ప్రత్యేకతను ఇచ్చాయి. మాతృ దేశానికి దూరంగా, అపరిచిత వాతావరణంలో జీవించడానికి వాళ్ల భక్తి ప్రపత్తులే వాళ్లకు తోడ్పడ్డాయి. వాళ్లు చిన్న చిన్న గుడిసెలలో ఉంటూ, గ్రామ దేవతలను, ఇలవేల్పులను పూజిస్తూ, తమ బిడ్డలకు భారతీయ విలువలను, సంప్రదాయాలను నేర్పించగలిగారు" (రెడ్డి లక్ష్మడు, 2013: పు. 24)

మారిషస్ దేశంలోని తెలుగువారి ఆనాటి జీవన విధానాన్ని పరిశీలిస్తే మొదటి తరంవారు పగలంతా చెరకు తోటలలో పని చేసి, సాయంత్రపువేళలో తమ పిల్లలకు తెలుగు అక్షరాలను ఇసుక తిన్నెల మీద రాసి నేర్పించేవారని తెలుస్తుంది. ఆ కాలంనుంచే తెలుగువారు తమ భాషను కాపాడుకోవటానికి, పెంపొందించటానికి అన్ని విధాలా ప్రయత్నం చేసేవారని చెప్పవచ్చు. అయితే ఈ రైతులకు వ్యాకరణం తెలియకపోయినా, తమ పిల్లలకు పాటల ద్వారా, నాటకాల ద్వారా తెలుగు నేర్పించేవారు. తెలుగు భాష పట్ల మమకారంతో భజనలు, రామదాసు కీర్తనలు, నాటకాలు, శ్లోకాలు, నృసింహ శతకం మొదలైనవాటి ద్వారా భావితరాలకు అందించారు (భాస్కర్, 2015).

మారిషస్‌లో ఆనాడు తెలుగు గ్రంథాలు లేకపోవటంవల్ల, తెలుగు భాషా ప్రచారం చేయటానికి కొంత మంది పండితులు రామాయణ, భారత, భాగవతాది కథలను మాత్రమే కాకుండా, సొంతంగా కథలు, భక్తి పాటలు సృష్టించి బోధించేవారు. ఇంతేకాకుండా, కొత్త సంవత్సర వేడుకల సందర్భాల్లో క్రైస్తవ ప్రభువుల వినోదంకోసం కొంత మంది తెలుగువారు సమావేశమై, శ్రీ రాముడి లీలలు, శ్రీ రాముని గురించిన నాటకాలు, వీరభద్రుని నాటకాలు, భారత భాగవతాది కథలను ఆధారంగా తీసుకుని కొన్ని నాటకాలను సొంతంగా రచించి ఉత్తర ప్రాంతంలోని కొన్ని చోట్ల ప్రదర్శించేవారు (రెడ్డి లక్ష్మడు, 2013).

మారిషస్ దేశపు చారిత్రక ఆధారాలను బట్టి 1948వ సంవత్సరంలో ఇక్కడి ప్రభుత్వం ఒక ముఖ్యమైన చట్టాన్ని అమలులోకి వేసిందని తెలుస్తుంది. కేవలం అక్షర జ్ఞానమున్న వారికే ఎన్నికల్లో ఓటు హక్కు ఉంటుందని ప్రభుత్వం ప్రకటించింది. తత్ఫలితంగా హిందీవారు, తమిళంవారు తమ తమ భాషలను నేర్చుకొని, ఓటు హక్కు పొందారు (భారతదేశంనుంచి తెలుగువారి కన్న వీళ్లే ఎక్కువ సంఖ్యలో వచ్చారనే విషయం గమనించవలసినది). అది గ్రహించి, తెలుగువారు కూడా తమ భాషలో అక్షర జ్ఞానాన్ని పొంది, ఓటు హక్కు సంపాదించారు (ibid).

నాటి ప్రభుత్వం చర్చిలకు రాయితీ (subsidy) ఇచ్చేది. 1948వ సంవత్సరం తర్వాత ఇతర మతాల దేవాలయాలకు కూడా ఈ ఆర్థిక సహాయం చేయటం మొదలుపెట్టింది. ఇది భారతీయ సంస్కృతులను ప్రోత్సహించటానికి బాగా దోహదం చేసింది. ఈ రాయితీ హిందువులకు భాషా ప్రాతిపదికపై పంచిపెట్టాలని అత్యసంఖ్యాకవర్గ ("మైనారిటీ") భాషా వ్యవహర్తలు ప్రతిపాదించటం జరిగింది. ఈ విధంగా వివిధ భాషా వ్యవహర్తలు తమ భాషా సంస్కృతులను పరిరక్షించటానికి చేస్తున్న ప్రయత్నాలను చూసి, తెలుగువారు కూడా తమ భాష మీద ఉన్న అభిమానంతోను, తమ పూర్వీకుల పట్ల ఉన్న గౌరవప్రేమాభిమానాలతో తమ పిల్లలకు తెలుగు భాష బోధించాలని పూనుకొన్నారు. వారు కూడా సమాజంలో తమ ప్రత్యేకతను కాపాడటానికి భాషా ప్రయుక్త రాయితీ అడగటం జరిగింది.

అప్పటినుంచి ఇప్పటివరకు మారిషస్ కేంద్ర ప్రభుత్వం దేశంలోని సాంస్కృతిక సంస్థలన్నిటికీ భాషాపరంగా రాయితీలు ఇవ్వటం జరుగుతున్నది. ఈ డబ్బును ఈ సంస్థలు భాషా సంస్కృతులను పరిరక్షించటానికి ఖర్చుపెట్టాలి. ఇంతకు ముందే చెప్పినట్టు ప్రపంచంలో ఏ దేశంలో కూడా భాషా సంస్కృతులను పరిరక్షించటానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయటంలేదు కాని మారిషస్ వంటి చిన్న ద్వీపంలో ఇలా జరగటం గొప్ప విషయమే.

## 2.1 మారిషస్‌లో ద్వితీయ భాషగా తెలుగు భాష

ప్రపంచంలో ప్రసిద్ధికెక్కిన భాషలు ఒక దేశంలో పాలకభాషలుగా ఉంటే, అక్కడ సామాన్య ప్రజల భాషకు వికాసం చెందటానికి చాలా తక్కువ ప్రోత్సాహం లభిస్తుంది. అటువంటప్పుడు ప్రజల భాషా వికాసానికీ, అభివృద్ధికీ అవకాశాలు కూడా చాలా తక్కువగా ఉంటాయి. మారిషస్‌లో ఒక కాలంలో భారతీయ భాషలకు కూడా ఇదే గతి ఉండేది. ఆ నాడు భారతీయ భాషలకు పాలకుల ఆదరణ ప్రోత్సాహాలు ఉండేవి కాదు. త్వరగా ఈ విషయాన్ని గుర్తించిన భారతీయ భాషా వ్యవహర్తలు తమ భాషకు అలాంటి దుర్గతి రాకూడదని తమ భాషా సంస్కృతులను కాపాడుకోటానికి శాయశక్తులా పాటుబడటం మొదలుపెట్టారు.

ఫ్రెంచి పరిపాలనా కాలంలో మారిషస్‌లో వేరే రంగాలతోపాటు విద్యా రంగంలో కూడా ఫ్రెంచి భాషకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వటం జరిగింది. ఆ నాడు దేశీయ పాఠశాలల్లో బోధన ఫ్రెంచి భాష చుట్టూ కేంద్రీకరింపబడి ఉండేది. కాని క్రమక్రమంగా అనేక దేశాలనుంచి వలసదారుల రాకతో మారిషస్ బహుభాషా సమాజంగా మారిపోయింది. అయినా కూడా విద్యా విధానంలో చాలా కాలం వరకు ఫ్రెంచి భాషే ఆధిక్యత వహించింది.

## 2.2 ద్వితీయ/పర భాషగా తెలుగు భాషా బోధన

ఫ్రెంచివారి పరిపాలన తర్వాత బ్రిటిషు పరిపాలనలో ఇక్కడ చాలా పాఠశాలలు స్థాపింపబడ్డాయి. అప్పుడు ఫ్రెంచి భాషతోపాటు క్రమంగా ఆంగ్ల భాష కూడా పాఠ్యప్రణాళికల్లో చోటుచేసుకుంది. కాబట్టి ఆంగ్లేయుల పరిపాలనా కాలంలో మారిషస్ దేశంలో ద్విభాషాభ్యసనం కొనసాగేదని తెలుస్తుంది.

1903వ సంవత్సరంనుంచి ప్రభుత్వపు ప్రాథమిక బళ్లలో మొదటి మూడు తరగతుల్లో ఆంగ్లం, ఫ్రెంచి భాషల బోధన, నాలుగో తరగతినుంచి ఆంగ్ల భాషా మాధ్యమంగా భాషేతర విషయాలను బోధించటం ప్రారంభమయింది. మొదట్లో ప్రభుత్వపు పాఠశాలల్లో భారతీయ భాషల బోధన జరిగేది కాదు. భారతీయ వలసదారులు కూడా ఆ కాలంలో విద్యాభ్యాసం పట్ల ఎక్కువ ఆసక్తి చూపించలేదు. తమ వసతి సౌకర్యాలను, ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచుకొనే ఉద్దేశంతో, వారు చిన్నతనంలోనే తమ పిల్లలను పనులలో పెట్టేవారు. వలసదారుల పిల్లల నిరక్షరాస్యతను చూసి, బాధపడిన కొందరు బ్రిటిషు గవర్నర్లు వారికి కూడా విద్యాభ్యాసం జరగాలని ప్రయత్నం చేశారు. తత్ఫలితంగా 1854వ సంవత్సరంలో ఇంగ్లీషు, తమిళం అనే రెండు భాషలను బోధించటానికి పోర్ట్-లూయి అనే పట్టణంలో బళ్లు కట్టించాలని గవర్నరు హిగ్గిన్సన్ ప్రతిపాదించటం జరిగింది. కొంత కాలం తర్వాత Sir Arthur Phayre అనే గవర్నరు కూడా చెరకు ఎస్టేట్లలో ఉన్న పిల్లలకోసం వారి మాతృభాషలోనే పాఠ్య విషయాలు నేర్పించటానికి పాఠశాలలు కట్టించాలని ప్రతిపాదించినా పాలకులు ఎవ్వరూ దాన్ని అమలులోకి పెట్టలేదు (రెడ్డి లక్ష్మణుడు, 2013).

నాడు భారతీయ భాషల బోధనకు కావలసిన ప్రభుత్వపు ప్రోత్సాహం లేకపోయినా, కొంత మంది భారతీయులే సాహసించి, భారతీయ భాషలైన హిందీ, తమిళ భాషల్లో విద్యను నేర్పటానికి కొన్ని పాఠశాలలను నెలకొల్పారు.

ఇరవయ్యో శతాబ్దారంభకాలంలో భారతీయుల ఆర్థిక పరిస్థితి కొంత వరకు మెరుగయిందని చెప్పవచ్చు. అప్పుడు తమ పిల్లలను పాఠశాలకు పంపాలనీ, వారికి కూడా విద్యాభ్యాసం కావాలని ఆశ పడ్డారు. కాని పాఠశాలలో నేర్పించే పాశ్చాత్య సంస్కృతీ సంప్రదాయాల ప్రభావం వారి పిల్లల మీద తప్పకుండా పడుతుందనీ, తమ భారతీయ సంస్కృతి ప్రత్యేకతను కోల్పోయే అవకాశముంటుందని గ్రహించి, కొంత మంది భారతీయ నాయకులను, సంఘ సంస్కర్తలను, మత ప్రవక్తలను కలుసుకొని, భారతీయ భాషల బోధనకు విశేష ప్రయత్నాలు చేశారు. చందాలు పోగు చేసి సాంస్కృతిక కేంద్రాలను (బైట్కాలను) కట్టించి, తమ పిల్లలకు తమ మాతృభాషలోనే విద్యాభ్యాసం జరిపించటానికి పూనుకొన్నారు. ఈ విధంగా చందాలు

సేకరించి కొత్త కొత్త పాఠశాలలు నిర్మించి, తమ భాషా సంస్కృతులను పరిరక్షించటానికి ఎన్నో ప్రయత్నాలు చేశారు (ibid).

ఇన్ని ప్రయత్నాలు చేసినా, కాలం గడుస్తున్నకొద్దీ, ఇక్కడ వ్యవహారంలోనున్న క్రియోల్, భోజ్‌పురీ భాషల ప్రభావం తెలుగు వలసదారుల తర్వాతి తరాల మీద పడటం మొదలైంది. క్రమంగా తెలుగు భాష వలసదారుల మాతృభాషా స్థానాన్ని కోల్పోయి, వారి వంశీయులకు ద్వితీయ భాష అయింది.

ప్రస్తుత కాలానికి చెందిన తెలుగువారికి తెలుగు భాష మాతృభాష కాకపోయినా, వారిలో చాలా మంది దీన్ని ద్వితీయ భాషగా నేర్చుకోవడం జరుగుతున్నది. ప్రాథమిక పాఠశాలల్లో ప్రవేశించేసరికి ఆంగ్లం, ఫ్రెంచి వంటి భాషలతోపాటు, తాము ఇష్టపడిన భారతీయ భాషల్లో ఒక దాన్ని, లేక మాండరిన్, అరబ్బీ, మొరిష్యన్ క్రియోల్ మొదలైన భాషల్లో ఏదైన ఒక దాన్ని ద్వితీయ భాషగా అభ్యసించే హక్కు మారిషస్ రాజ్యాంగం విద్యార్థులందరికి కల్పించింది. మారిషస్ దేశపు జనాభాను బట్టి, ఇతర జాతులతో పోల్చి చూస్తే, తెలుగువారి సంఖ్య తక్కువ అని చెప్పవచ్చు. తత్ఫలితంగా భాషాపరంగా కూడా వీళ్లు అల్ప సంఖ్యాకులే.

మారిషస్ దేశంలో తెలుగు భాషా బోధన ప్రాథమిక, మాధ్యమిక, విశ్వవిద్యాలయ స్థాయిల్లో జరుగుతున్నది. ప్రాథమిక దశలో విద్యార్థులు ఆరు సంవత్సరాలకు తెలుగు నేర్చుకుంటున్నారు. మాధ్యమిక దశలో వారు ఏడో నించి తొమ్మిదో తరగతుల వరకు ఈ భాషను అభ్యసిస్తున్నారు. కాని పదో తరగతికి చేరేసరికి విద్యార్థుల సంఖ్య చాలా తగ్గిపోతున్నది. తెలుగు భాష నిర్బంధ విషయం కాకపోవటంవల్ల (non-compulsory subject) తక్కువ మంది విద్యార్థులు దీన్ని ఎంపిక చేస్తున్నారు. ఇంతేకాకుండా ఇక్కడి వయోవృద్ధ జనాభావల్ల విద్యార్థుల సంఖ్య క్రమక్రమంగా తగ్గిపోతున్నది.

తెలుగును ద్వితీయ భాషగా బోధిస్తున్నాం కానీ నేటి వాస్తవ్యాన్ని పరిశీలిస్తే, ఇది పరభాషగా మారిపోయిందని చెప్పవలసినది. దీనికి కారణమేమిటంటే తెలుగు భాషకు ప్రచారం ఎక్కువగా లేకపోవటం. ఇంతేకాకుండా ఈ భాష వ్యవహారాన్ని పరిశీలిస్తే,

తరగతిగది నాలుగు గోడల మధ్య, మందిరాలు, సాంస్కృతిక కార్యక్రమాలు మొదలైన చోట్ల తప్ప బయట తెలుగు వాడుక చాలా తక్కువగా కనిపిస్తుంది.

## 3.0 ముగింపు

భారతీయ వలసదారులు మారిషస్ దేశానికి వచ్చాక, వారు తమ భాషా సంస్కృతులను పరిరక్షించటానికి ఎంతగానో పాటుపడ్డారు. అయినా దేశంలో మారుతున్న పరిస్థితులవల్లగానో, ఇక్కడ వ్యవహారంలోనున్న మొరిష్యన్ క్రియోల్, పరిపాలనా భాషలైన ఆంగ్లం, ఫ్రెంచి మొదలైన భాషలవల్లగానో ఈ భారతీయ భాషలు చాలా వరకు మాతృభాషా స్థానాన్ని కోల్పోయి ద్వితీయ భాషగా లేదా పరభాషగా మారుతున్నాయి.

నాటినుంచి నేటి వరకు మారిషస్ దేశంలో తెలుగు భాషా సంస్కృతులను పరిరక్షించటానికి ఎందరో మహానుభావులు, ప్రభుత్వ సహకారంతో సంస్థల నిర్వాహకులు, తెలుగు భాషా ప్రియులు కృషి చేస్తూనే ఉన్నారు. భావితరాలకు ఈ అమూల్యమైన భాషా సంస్కృతులను అందించే కర్తవ్యం మాది అని భావించి, విద్యా, సాంస్కృతిక రంగాల్లో అందరూ సాధ్యమైనంత వరకు సహాయం చేస్తున్నారు. విద్యారంగంలో కూడా తెలుగు భాషా సాహిత్యాలను పెంపొందించటానికి ఎందరో పాటుబడుతున్నారు.

కాని ఇప్పటికే మారిషస్ దేశంలో తెలుగు భాషకు పరభాషా పరిస్థితి ఏర్పడితే, ఇంకా ఇరవై ముప్పై సంవత్సరాల కాలంలో దీని పరిస్థితి ఏమవుతుందో విచారింపవలసిన అవసరం ఎంతగానో ఉంది. కాబట్టి ఇక్కడ ఉన్న తెలుగువారు తమ భాషను పరిరక్షించటానికి ఇంకా తీవ్రమైన చర్యలు తీసుకోవాలి. భాష పోతే సంస్కృతి పోతుంది. ఇంతేకాకుండా ఒక భాష సజీవంగా ఉండాలంటే ఆ భాషలో మాట్లాడాలి అని చాలా మంది భాషావేత్తలు చెప్తూ ఉంటారు. ఇక్కడి సమస్య ఏమిటంటే ఈ భాషను వాగ్రూపంలో తక్కువ మంది వాడతారు. చిన్న వయస్సు నుంచే పిల్లలకు తెలుగు భాషలో మాట్లాడటం నేర్పిస్తే దేశంలో తెలుగు భాషా పరిస్థితి మెరుగవుతుందని భావిస్తాను. దీన్ని సాధించాలంటే ప్రభుత్వ సంస్థల సహకారం తోపాటు తల్లిదండ్రుల సహకారం కూడా చాలా అవసరం. అందరూ కలసికట్టుగా

తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తే తెలుగు భాషా పరిస్థితి తప్పకుండా అభివృద్ధి చెందుతుంది.

===============================================================================

## ఉపయుక్త గ్రంథాల సూచి


ఆనందమూర్తి, వి. (1990). *మారిషస్‌లో మనవాళ్లు.* *In:* తెలుగువాణి (eds.) *మూడవ ప్రపంచ తెలుగు మహాసభల ప్రత్యేక సంచిక* held in Mauritius on 10th -13th December 1990.

రెడ్డి లక్ష్ముడు, జి. (2013). *మారిషస్‌లో తెలుగు భాషా బోధన – మూల్యాంకనం – Teaching of Telugu in Mauritius – An Evaluation.* New Delhi: Star Publications Pvt. Ltd.

ARCHIVES OF INDIAN IMMIGRATION – MGI. Available on: http://www.mgirti.org/facilties/mgi-folk-museum/205-mgi-folk-museum-the-archives-of-indian-immigration-.html [Accessed on: 29.07.2014]

BHASKAR, T.L.S. (2015). Telugu Language in Mauritius. Available at: https://mauritiantelugu.wordpress.com/2015/06/16/18/ [Accessed on: 27.08.2015, 14:32]

BHAT, C. & BHASKAR, T.L.S. (2007). Contextualising Diasporic Identity – Implications of Time and Space on Telugu Immigrants. In OONK, G. (ed.). *Global Indian Diasporas – Exploring Trajectories of Migration and Theory*. IIAS – Amsterdam University Press. Available from: www.oapen.org/download?type=document&docid=340114 [Accessed on: 06.02.2015, 15:05]

MILES, W.F.S. (2000). The Politics of Language Equilibrium in a Multilingual Society: Mauritius. *Comparative Politics*, Vol. 32 (2), 215-230.

MINISTRY OF FINANCE AND ECONOMIC DEVELOPMENT, (2012). *Housing and Population Census 2011 Vol. II Demographic and Fertility Characteristics.* Available from: http://statsmauritius.govmu.org/English/Documents/publications/Housing/economics%20and%20social%20indicators/reports/2011VolIIPC.pdf [Accessed on 15.05.2014, 15:15]

RAJAH-CARRIM, A. (2005). Language Use and Attitudes in Mauritius on the Basis of the 2000 Population Census. *Journal of Multilingual and Multicultural Development*, Vol. 26, pp 317-332.

RAJAH-CARRIM, A., (2007). Mauritian Creole and Language Attitudes in the Education System of Multiethnic and Multilingual Mauritius. *Journal of Multilingual and Multicultural Development*, Vol. 28 (1), pp. 51-71. Available from:

http://www.africanafrican.com/folder12/african%20african%20american2/haiti/carrim_multilingual_20073.pdf [Accessed on: 26.02.2015, 13:15]

==================================================================



**Dr. (Mrs.) Rajwantee Dalliah (Ph.D.)**
**Lecturer, Department of Telugu Studies**
**Mahatma Gandhi Institute, Mauritius**
**rdalliah@yahoo.com**
**reena.dalliah@mgi.ac.mu**